# రథసప్తమి వ్రత విధానము

సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



# రథసప్తమి వ్రత విధానము

భువిలోనున్న సకల జనులకు ఇహపరసౌఖ్యములను కలిగించు వ్రతరాజము. ఈ పుస్తకములో ప్రత్యక్ష దైవమైన ఆదిత్యుని ఆరాధించు వ్రత విధానము సవివరముగా ఇవ్వబడినది.

పూర్వం ధర్మరాజు ఒకసారి శ్రీకృష్ణ భగవానుడిని రథ సప్తమి విధానాన్ని గురించి వివరించమని కోరాడు. అప్పుడు కృష్ణుడు వ్రత కధతో సహా వ్రత విధానాన్ని వివరించాడు.

పూర్వం కాంభోజ దేశాన్ని యశోవర్తనుడు అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆ రాజుకు లేక లేక ముసలితనంలో ఓ కుమారుడు జన్మించాడు. కొడుకు పుట్టాడన్న సంతోషం కొద్ది సమయం మాత్రమే ఆ రాజుకు దక్కింది. పుట్టిన బిడ్డ ఏదో ఒక రోగంతో బాధ పడుతూ ఉండేవాడు. జబ్బున పడ్డ కొడుకును చూసి రాజుకు ఎంతో దిగులు వేసింది. ఎన్ని వైద్యాలు చేయించినా ఫలితం లేకపోయే సరికి క్రాంతధర్శనులైన ఋషులను పిలిపించి తన కుమారుడికి కలిగిన అనారోగ్యాన్ని గురించి చెప్పి దానికి విరుగుడు తెలియచేయమన్నాడు. త్రికాల వేదులైన ఆ ఋషులు రాజకుమారుడిని చూసి ఆ బిడ్డ గత జన్మనంతటినీ అవగతం చేసుకున్నారు.

గత జన్మలో ఎంతో సంపన్నుడైనా ఎవరికీ కద్దిపాటి దానం కూడా చేయలేదు. అయితే అతడు జీవితం చివరిదశలో ఒకసారి ఎవరో చేస్తూ వున్న రథ సప్తమి వ్రతాన్ని చూసాడు. అలా ఆ వ్రతాన్ని చూసిన పుణ్య కారణంగా రాజు ఇంట బిడ్డగా జన్మించాడు. సంపదలుండి దానం చెయ్యని పాపానికి రాజ కుటుంబంలో జన్మించినా నిరంతరం రోగగ్రస్తుడై ఉంటున్నాడని ఋషులు చెప్పారు. తన బిడ్డ ఆ విషమ పరిస్థితి నుండి బయట పడటానికి ఏదైనా ఉపాయం చెప్పమన్నాడు రాజు. అప్పుడు ఆ ఋషులు రధ సప్తమీ వ్రతాన్ని శాస్త్ర విధిగా చెయ్యమని, అలా చేస్తే రాజకుమారుడి రోగాలు నశిస్తాయని చెప్పారు.

మాఘ శుద్ధ షష్టి నాడు నూరిన నువ్వుల ముద్దతో శరీరానికి నలుగు పెట్టుకుని అందుబాటులో వున్న నది, చెరువు, నుయ్యి ఇలా ఏదో ఒక చోట స్నానం చేయాలి. ఆ తరువాత సూర్య ఆలయానికి వెళ్ళి పూజ చేయాలి. ఆ మర్నాడు అంటే సప్తమి తిధిన సూర్యోదయానికి ముందే నెత్తి మీద లోహపు ప్రమిదలో దీపం పెట్టుకుని స్నానం చేయాలి. ఆ తర్వాత శక్తి కొద్దీ బంగారంతో కాని, వెండితో కాని రధాన్ని చేయించి దానికి ఏడు గుర్రాలను, సూతుడిని అమర్చాలి. అందులో సూర్య ప్రతిమను పెట్టాలి.

ఒక కొత్త గుడ్డను పరిచి దాని మీద ఈ రధాన్ని ఉంచాలి. సాయంకాలం వరకూ ఉపవాసం ఉండి పూజలు చేసి రకరకాల పండ్లను నివేదించి ఆ

రాత్రికి జాగారం చేయాలి. ఆ వ్రతం అంతా నది, సరోవర తీరాలలో చెయ్యడం మేలు. ఆ మరునాడు సూర్యుడికి మళ్ళీ పూజలు చేసి దానధర్మాలు, వ్రతపారాయణ అనంతరం రథాన్ని, సూర్యప్రతిమను ఉత్తములూ, అర్హులూ అయిన వారికి దానమివ్వాలి. ఇలా చేస్తే సర్వరోగ విముక్తి, పుణ్యలోక ప్రాప్తి కలుగుతాయి అని కాంబోజరాజుకు పూర్వం ఎప్పుడో ఋషులు చెప్పిన విషయాన్ని కృష్ణుడు ధర్మరాజుకు చెప్పాడు.

ప్రస్తుతం ఈ వ్రతానికి సంబంధించి కాలానుగుణంగా బంగారు రథం లాంటివి లేకపోయినా చిక్కుడు కాయలతో రథాన్ని చేయడం కనిపిస్తుంది.

మాఘ శుక్ల సప్తమీయనబడు రథసప్తమీ దినమున సూర్యోదయానికి పూర్వమే స్నానము దానాదులు చేసినచో, ఆయురారోగ్య సంపదలు వృద్ధికాగలవు. కాన స్నానము చేయుతరిని, యీ మంత్రము పఠించుచు స్నానము చేయవలయును.

"యద్యజ్జన్మ కృతంపాపం. మయాసప్త సుజన్మను|

తన్మేరోగంచ శోకం, మాకరీ హన్తుసప్తమీ|

"ఏతజన్మ కృతంపాప యచ్చజన్మాంతరార్జితరి|

మనోవాక్కాయజం, యచ్చజ్ఞాతాఽ జ్ఞాతేనయేపునః|

ఇతిసప్త విధంపాపం స్నానాన్మే సప్త సత్తి కే
సప్తవ్యాది సమాయుక్తం హరమాకరి! సప్తమీ|

ఏ తన్త్రంత్రత్రయ జప్త్యాస్నాత్వా పదోదకేసరః
కేశవాదిత్య మాలోక్య క్షణాన్నిష్కలు షోభవేత్||

ఈ మూడు మంత్రములు పఠించుచు స్నానము చేసినచో వెంటనే పాపపరిహారమగును.

చెఱకుగడతో నీటిలోత్రిప్పి, జిల్లెడు ఆకులు రేగుఆకులు పండ్లు శిరస్సుననుంచుకొని స్నానము చేయవలయును.

"ఇక్షుదంతెన, జలంచాలయిత్వా, సప్తాద్కపత్రాణి|
బదరీపత్రాణిచ శిరసినిధాయ పూర్వోకె^్త్రః
మంత్రేరః స్వాత్వా సూర్యం సంపూజ్య

పై రీతిని, జిల్లెడు ఆకులు శిరముననుంచి స్నానముచేసి సూర్యుని పూజించవలయును.

సూర్యునికామంత్రము చెప్పి అర్ఘ్యమివ్వవలయును.

"సప్తసప్తిసహప్రీత, సప్తలోక ప్రదీపన|
సప్తమీ సహితో దేవ, స్రుహాణార్ఘ్యం దివాకర"

అని సూర్యునకర్ఘము దోసిలోనీరు గ్రహించి విడువవలయును. అనంతర మీ మంత్రము పఠించుచు సూర్యుని నమస్కరించ వలమును.

""జననీ సర్వలోకానాం, సప్తమీసప్త సప్తిచే,

సప్త వ్యా హృతికేదేవి, నమస్తే సూర్యమండల!

అని నమస్కరించి శుషవస్త్రములు ధరించి దాన ధర్మ జపాదులు చెసికొనవలయును.

"ఏవంప్రభావా సాసంధ్యా సర్వపాపప్రణాశినీ' అని సర్వపాపములు సంధ్యావందనమువలన నశింపగలవు.

"దీర్ఘాయుషో భవిష్యన్తి' యనియు సంధ్యావందనము త్రికాలముల యందు నాచరించువారు, పూర్ణాయుస్సునుగల్గి చాలాకాలము జీవించగలరు.

""ఉత్తమీ తారకోపేతా'' యని, నక్షత్రములుండగనే ప్రాతఃకాల సంధ్యావందనము ప్రారంభింపవలయును.

"మధ్యమాలప్త తారకా' యని, నక్షత్రములు తొలగిన పిదప సూర్యోదయములోపుగ చేయు సంధ్య నుధ్యమఫలితము నొసంగును.

"వీచాస్యా దుదయా దూర్థం' అని, సూర్యోదయానంతరము సంధ్యావందనము చేయుట, నీచఫలితము లిచ్చును.

""కాలే నాచరితా యాస్యాత్సా సంధ్యా ఫలదాయినీ'' సకాలములో చేయు సంధ్యావందనము మంచి ఫలములిచ్చును.

"అకాలాచరితా సంధ్యా వంధ్యా నారీవనిష్ఫలా' అకాలములో (సూర్యోదయానంతరము) చేయు సంధ్యా వందనము, గొడ్రాలు జీవితము వలె, ఫలహీనము.

"తస్మా త్సూర్యోదయా త్పుర్వం, ప్రాతఃసంధ్యాం సమాచరేత్ కనుక సూర్యోదయానికి మునుపే స్నానమొనర్చి ప్రాతఃసంధ్య చేయవలయును,

"అతఏవ ద్విజాతీనాం, సంధ్యా కర్మైవబలవత్తరమ్| బ్రాహ్మణులకు సంధ్యావందనమే, ముఖ్యమైన బలకరము, అనగా శక్తిదాయకము.

ఏటా మాఘశుద్ధ సప్తమినాడు తలమీదా, భుజాల మీదా , మోచేతి మడతల మీద , అరచేతుల్లోనూ ( మొత్తం ఏడు) జిల్లేడాకులు ఉంచుకుని పై పద్యం చదువుతూ సూర్యుడికి నమస్కరించి స్నానం చేయడం మన సంప్రదాయం . ' గత ఏడు జన్మలలోనూ నేను చేసిన పాపాలను, రోగాలను, శోకాలనూ, మకర రాశిలోని సప్తమి హరించు గాకా' అని దీనర్థం. ఆ రోజున హిందువులంతా సూర్యుణ్ణి పూజించి ఆరు బయట సూర్యకాంతి పడే ప్రదేశంలో పిడకల మంట మీద పరమాన్నం వండి దాన్ని చిక్కుడు ఆకుల్లో పెట్టి నైవేద్యం పెడతారు. చిక్కుడు కాయలతో రథం తయారు చేసి దినకరుడికి సమర్పించుకుంటారు. ఈ రోజు ప్రత్యేకత ఏమిటంటే....

**పురాణాల ఆధారంగా...**

ఈ రోజు సూర్య జయంతి. ఏడు గుర్రాలు పూంచిన ఏకచక్ర రథం పై రెండు చేతులా తెల్లటి పద్మాలు ధరించి ఉషస్సమయాన ఉదయించే ప్రత్యక్ష నారాయణుడి పుట్టిన రోజు. రామాయణ , భారతాలకు సూర్యుడితో గట్టి సంబంధమేం ఉంది.

రాముడిది రఘువంశం. అంటే ఆయన సూర్యవంశజుడన్నమాట! అగస్త్యుడు శ్రీ రాముడికి బోధించిన మంత్రాలే ' ఆదిత్య హృదయం 'గా ప్రాచుర్యం పొందాయి. తనను పండుగా భావించి మింగేయబోయిన చిన్నారి హనుమంతుడికి గురువుగానూ రామాయణంలో కనిపిస్తాడు సూర్యుడు.

అటు భారతం లోనూ కర్ణుడి పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దుర్వాస మహాముని నుంచి మంత్రోపదేశం పొందిన కుంతికి ముందుగా గుర్తొచ్చింది సూర్యుడే. సత్రాజిత్తుకు శమంతకపణిని , ధర్మరాజుకు అక్షయపాత్రనూ, ఇచ్చింది భాస్కరుడే.

ఈ రోజు ఖగోళ పరంగా సూర్యుడు తన సంచార గతిని మార్చుకునే రోజు అని చెప్పొచ్చు. ఈ రోజు నుంచే భూమి సూర్యుడికి దగ్గరవటం ప్రారంభిస్తుంది. ఆదిత్య శక్తి భూమికి పుష్కలంగా లభించడం మొదలవుతుంది.